నమస్తే తెలంగాణ

# రాజన్న సిరిసిల్ల

10 | కరీంనగర్, బుధవారం 26 మార్చి 2025 | RAJANNA SIRCILLA

## బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి

### అసెంబ్లీలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్


మెట్‌పల్లి, మార్చి25 : బీడీ కార్మికులకు జీవన భృతి ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, ఆ ఘనత నాటి సీఎం కేసీఆర్‌దేనని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కొనియాడారు. మంగళవారం శాసనసభ జీరో అవర్‌లో బీడీ కార్మికులు, ఆశ కార్యకర్తలు, ఆటో కార్మికుల సమస్యలను ఆయన ప్రస్తావించారు. బీడీ కార్మికుల కష్టాలు వర్ణనాతీతం అని వివరించారు. శాసన సభా సమావేశాల్లో తమ సమస్యలపై ఏ ఒక్కరు కూడా ఊసెత్తడం లేదని బీడీ కార్మికులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. కోరుట్ల నియోజకవర్గంలో బీడీ కార్మికులు అత్యధిక సంఖ్యలో ఉన్నారని, జీవన భృతి రాని అనేక మంది కార్మికులు ఉన్నారని, వెంటనే వారిని గుర్తించి లబ్ధిచేకూర్చాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలకు నెలకు ₹18 వేలు, ఆటో కార్మికులకు ₹12 వేలు ఇస్తామని ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆయా వర్గాలను ఆదుకోవాలని కోరారు.

# సాగునీరు రాదు.. పొలం పారదు

## కొత్తపల్లిలో రైతన్న అరిగోస

- చేతికందే దశలో ఎండిన 50 ఎకరాలు
- ప్రశ్నార్థకంగా మరో 350 ఎకరాలు
- బొమ్మారెడ్డిపల్లి నుంచి లింక్ కెనాల్‌కు నిర్మాణానికి గత సర్కారు నిధులు.. పనులు ప్రారంభం
- ప్రభుత్వం మారడంతో పట్టింపు కరువు
- ఆందోళనలో రైతులు

కొత్తపల్లిలో ఎండిన వరి పొలాలు



సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. రైతన్నను గతంలో ఎన్నడూ లేనివిధంగా వెంటాడుతున్నాయి. ఒకప్పుడు పుష్కలమైన జలాలతో భూమికి బరువైన పంటలు పండించి పల్లెలు ఇప్పుడు పంటలను కాపాడుకునేందుకు తండ్లాడుతున్నాయి. ధర్మారం మండలం కొత్తపల్లిలో సాగునీరందక పొలాలు బీటలు వారుతున్నాయి. ఇది చూసిన రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి

పెద్దపల్లి, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ధర్మారం మండలం కొత్తపల్లి శివారులో గిరిజన రైతులు ఏటా దాదాపు 400 ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. భూగర్భజలాల ఆధారంగా పంటలు పండిస్తుంటారు. రెండేండ్ల కిందటి వరకు గ్రామంతోపాటు సమీపంలోని చెరువులు, కుంటల్లో పుష్కలంగా జలాలు ఉండడం వల్ల భూగర్భజలాలు సమృద్ధిగా ఊరి రెండు పంటలు తీశారు. అయితే గత రెండు సీజన్ల నుంచి అష్టకష్టాలు పడుతున్నారు. భూగర్భజలాలు తగ్గిపోతుండడంతో పంటలను కాపాడుకోలేక తండ్లాడుతున్నారు. ఈ యేడాది 400 ఎకరాల్లో పంట వేయగా, అందులో 50 ఎకరాలు ఇప్పటికే ఎండిపోయింది. మరో 350 ఎకరాలు ఎండిపోయే దశకు చేరింది. కండ్లముందే పంటలు దెబ్బతింటుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంటలు కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ₹60వేల నుంచి ₹70వేల వరకు పెట్టుబడి పెట్టి పూడిక తీయిస్తున్నా ఫలితం లేక పంటలను పశువులకు మేతగా వదిలేస్తున్నారు.

### లింక్ కెనాల్‌పై సర్కారు నిర్లక్ష్యం

కొత్తపల్లి శివారులోని భూములకు సాగునీరందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం బొమ్మారెడ్డి పల్లిలోని ఎస్సారెస్పీ ఉపకాలువకు అనుసంధానంగా కాలువ నిర్మాణానికి ₹19కోట్లు మంజూరు చేసి, పనులు ప్రారంభించింది. కానీ, ప్రభుత్వం మారిన తర్వాత పట్టించుకునేవారు లేక మధ్యలోనే ఆగిపోయింది. దీనిపై పాలకులు దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఈ కాలువ నిర్మాణం ఓ కొలిక్కి వచ్చేదని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



..పక్క చిత్రంలో కనిపిస్తున్నది గుగులోత్ కలమ్మ. ఆమె మూడెకరాల పొలం ఇప్పుడిప్పుడే ఎండిపోతున్నది. గతేడాది ఇదే బావి పూడిక తీయించేందుకు ₹70వేలు ఖర్చు చేసింది. మళ్లీ ఈ యేడాది బావి ఎండింది. వారం రోజులుగా క్రేన్‌తో పూడిక తీయిస్తున్నది. ఇప్పటికే ₹60వేల వరకు ఖర్చు చేసింది. అయినా నీళ్లు వస్తాయనే నమ్మకం లేక ఆందోళన చెందుతున్నది. ఇలా అయితే ఎలా సాగు చేస్తామని, తమ రెక్కల కష్టం అంతా ఈ నీళ్లకే పోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నది.



కొత్తపల్లిలో ఎండిపోయిన వ్యవసాయ బావి



పక్క చిత్రంలో కనిపిస్తున్నది భూక్యా చిన్నమ్మ. రెండెకరాల్లో వరి సాగు చేసింది. ఇప్పుడు అందులో ఒక ఎకరం పూర్తిగా ఎండిపోయింది. వాటిలో ఆవులను మేపిస్తున్నది. మరో ఎకరం కాపాడుకునేందుకు వ్యవసాయ బావిలో పూడిక తీయిస్తున్నది. ఇప్పటికే ₹70వేలు ఖర్చు చేసినా పంటకు సరిపడా నీళ్లు అందుతాయనే నమ్మకం లేదని ఆమె వాపోతున్నది. సర్కారే తమను ఆదుకోవాలని వేడుకుంటున్నది.

### ఎక్కడా లేని కష్టం వచ్చింది



కాలువ నిర్మాణం కోసం పైసలు వచ్చినయి. పని మొదలైంది. ప్రభుత్వం మారినంక మధ్యలోనే ఆగిపోయింది. ఇప్పుడు దాన్ని పట్టించుకునేటోళ్లు లేరు. మాకు ఎక్కడా లేని కష్టం వచ్చింది. ఆ కాలువ నీళ్లొస్తేనే మాకు కష్టాలు తీరుతయి. గతంల ఎప్పుడూ ఇట్ల ఇంత ఘోరంగా పంటలు ఎండిపోలే. పంటలు చూస్తుంటే దుఃఖమస్తంది.

**- అజ్మీరా సురేందర్, రైతు**

### ఇరువై గుంటలు పోయేటట్టే ఉన్నది



నాకు ఇక్కడ ఉన్న భూమే 20 గుంటలు. తిండి మందం పెట్టుకుంట. కానీ, ఈ సారి ఘోరంగా కరువచ్చింది. బావుల్ల నీళ్లు లేవు. ఇప్పటికే నా పది గుంటల పొలం ఎండింది. ఇంకా పది గంటలు కూడా ఎండేటట్టు ఉన్నది. మమ్ముల ప్రభుత్వమే ఆదుకోవాలే.

**- గుగులోతు రాజు నాయక్, రైతు**

# 'ఆశ'ల ఆగ్రహజ్వాల

## హక్కుల కోసం కదం తొక్కిన కార్యకర్తలు

- అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు
- అంబేద్కర్ విగ్రహాలకు వినతులు
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ₹18వేల వేతనం ఇవ్వాలని డిమాండ్



తిమ్మాపూర్ : రాజీవ్ రహదారిపై నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు



గంభీరావుపేట: రోడ్డుపై బైఠాయించి నినదిస్తున్న ఆశ కార్యకర్తలు




పెద్దపల్లి టౌన్: అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

కరీంనగర్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆశ కార్యకర్తలు కదం తొక్కారు. కాంగ్రెస్ సర్కారుపై కన్నెర్రజేశారు. ఈ నెల 17 నుంచి వరుస ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో పోరాటం ఉధృతం చేస్తున్నారు. మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. మానవహారాలుగా ఏర్పడ్డారు. రోడ్లపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందించారు. తమ సమస్యలు పరిష్కరించాలని వరుస ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం రావడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని, శ్రమకు తగ్గట్టుగా నెలకు ₹18వేల నికర వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రెండ్రోజుల కింద హైదరాబాద్‌లోని ఆరోగ్య శాఖ కమిషనరేట్ ముట్టడికి వెళ్లకుండా ఉక్కుపాదం మోపారని భగ్గుమంటున్నారు. తమకు కనీసం నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నిస్తున్నారు. అరెస్టులతో విరుచుకుపడడం సరికాదని హితవు పలుకుతున్నారు. ఇలాగే నిర్బంధాలు కొనసాగితే ఊరుకునేది లేదని స్పష్టం చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.



రాయికల్: మానవహారంగా ఆశ కార్యకర్తలు



గంగాధర: మధురానగర్ చౌరస్తాలో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

# కాంగ్రెస్‌ది అసమర్థ పాలన

- పదహారు నెలల్లో అప్పులే తప్ప సంక్షేమం లేదు
- రైతులు, చేనేత కార్మికులు చనిపోతున్నా పట్టించుకోరా..?
- అకాల వర్షాలతో పంటలు దెబ్బతింటే కనీసం పరామర్శించరా..?
- జగిత్యాలలో ఎమ్మెల్సీ ఎల్ రమణ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎల్ రమణ, పక్కన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు

జగిత్యాల, మార్చి 25: కాంగ్రెస్‌ది అసమర్థ ప్రభుత్వమని, పాలన చేతకాక సబ్బండవర్గాలను ఇబ్బందులు పెడుతున్నదని ఎమ్మెల్సీ ఎల్ రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కి పేదలను మోసం చేసిందని, పదహారు నెలల్లో చేసింది అప్పులు తప్ప సంక్షేమం శూన్యమని దుయ్యబట్టారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తన నివాసంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కొద్ది రోజుల క్రితం పడిన అకాల వర్షాలు, వడగండ్లతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, బాధితులను పరామర్శించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఎమ్మెల్యే, మంత్రులకు తీరిక లేదా అని ప్రశ్నించారు. పాలనలో కాంగ్రెస్ విఫలమైందని, ఇచ్చిన హామీలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో మాట్లాడితే దాటవేసే ధోరణిలో ఉన్నారే తప్ప, సమాధానం ఇచ్చే పరిస్థితిలో లేరని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పులు విపరీతంగా పెరిగాయని, పదహారు నెలల పాలనలో ₹1.58లక్షల కోట్ల అప్పు చేశారన్నారు. దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం ఇంత స్వల్పకాలంలో ఈ స్థాయిలో అప్పులు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేక రైతులు, చేనేత కార్మికులు ఆగమైతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ ₹2 లక్షల రుణమాఫీ చేశామని కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేసుకుంటున్నారని, కానీ రాష్ట్రంలోని ఏ ఒక్క గ్రామంలో సంపూర్ణంగా మాఫీ జరిగిన దాఖలాలు లేవన్నారు. కానీ, ప్రభుత్వం అందరికీ చేశామని చెబుతున్నదని ఆగ్రహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థత వల్ల సాగునీరు సరిగ్గా అందడం లేదని, విదుత్ సరిగ్గా లేక ఎవుసం ఆగమైందని, లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన చెందారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. అనంతరం దావ వసంత మాట్లాడుతూ, కాంగ్రెస్ చేతగాని పాలనతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సాగునీరందక ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతుంటే కన్నీళ్లు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు అని మండిపడ్డారు. ఇటీవల వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఎంఎంటీఎస్‌లో అత్యాచార ఘటన చాలా దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అందాల పోటీలు కాదు మహిళలకు భద్రత కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గట్టు సతీశ్, ఆనంద్ రావు, వొల్లెం మల్లేశం, దయాల మల్లారెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

## బండి సంజయ్‌పై ఫిర్యాదు




ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిగురుమామిడి, మార్చి 25: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై నిరాధారమైన ఆరోపణలు చేసిన ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు మంగళవారం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య చిగురుమామిడి ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంజయ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి అలా మాట్లాడడం సరికాదని హితవు పలికారు. ఆయన వెంట రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, మండల నాయకులు మహంకాళి కొమురయ్య, మాజీ సర్పంచ్ బోయిని శ్రీనివాస్, నాగెల్లి రాజిరెడ్డి ఉన్నారు.

# సర్కారు విధానాలతోనే నేతన్నల ఆత్మహత్యలు

- నిర్దిష్టమైన ఉపాధి చూపడంలో ప్రభుత్వం విఫలం
- పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ ధ్వజం
- రాజు కుటుంబానికి ₹10లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్

రాజన్న సిరిసిల్ల, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్లే రాష్ట్రంలో నేత కార్మికుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. వస్త్ర పరిశ్రమపై సరైన అవగాహన లేని, కార్మికులకు ఉపాధి కల్పించలేని ప్రభుత్వ తీరుతో ఇప్పటికే అనేక మంది కార్మికులు తమ కుటుంబాలను సాకలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఉపాధి లేక ఆత్మహత్య చేసుకున్న తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్‌కు చెందిన పరికిపండ్ల రాజు ఆత్మహత్య చేసుకోగా, మంగళవారం సిరిసిల్ల దవాఖాన వద్ద కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పవర్‌లూం కార్మికులకు నిర్దిష్టమైన ఉపాధి కల్పించి, నెలకు ₹26వేల వేతనం వచ్చేలా చూడడంలో సర్కారు విఫలమైందని ధ్వజమెత్తారు. ఆత్మహత్య చేసుకున్న రాజు కుటుంబానికి ₹పదిలక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. టెక్స్‌టైల్ పార్కులో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, మూతపడ్డ పరిశ్రమలను తిరిగి తెరిపించాలన్నారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని వెంటనే ప్రారంభించి, 2023 నుంచి నేతన్నలకు రావాల్సిన పదిశాతం యారన్ సబ్సిడీ నిధులు విడుదల చేయాలన్నారు. కార్మికులకు శాశ్వత పనికల్పించి ఆత్మహత్యలు జరుగకుండా చూడాలని కోరారు.